సాక్షి
వికారాబాద్
బుధవారం । 18 । జనవరి । 2023



కోటబాసుపల్లిలో ఉద్రిక్తత
తాండూరు మండలం కోటబాసుపల్లిలో ఇరువర్గాల మధ్య నెలకొన్న ఘర్షణ ఉద్రిక్త వాతావరణానికి దారితీసింది. 8లో ▸



పోలీసులమని చెప్పి..
పోలీసులనమని చెప్పి ఓ వ్యక్తి నుంచి బంగారు ఉంగరాన్ని తస్కరించిన ఘటన వికారాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. 8లో ▸



సాగుసాయం.. ఖాతాల్లోనే
కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పంట పెట్టుబడి సాయం పీఎం కిసాన్ యోజన అకౌంట్లలో ఉన్నా.. రైతుల చేతికి అందడం లేదు. 9లో ▸

న్యూస్‌రీల్

ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ యువతకు గ్రూప్‌– 2, గ్రూప్‌– 4 ఉద్యోగాల సాధన కోసం మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ నిఖిల ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ అభ్యర్థులు సత్తా చాటేలా నిష్ణాతులైన అధ్యాపకులతో ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17 నుంచి 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. వివరాలకు సెల్: 9573859268లో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: జిల్లాలో కాంట్రాక్ట్ విధానం ద్వారా నాలుగు ఫార్మసిస్ట్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాల్వన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు www.vikarabad.tea nfana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 18నుంచి 20వ తేదీ సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

జిప్సం ఫ్యాక్టరీని మూసేస్తాం



ఫ్యాక్టరీ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు, స్థానికులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న శ్రీరాజరాజేశ్వరి జిప్సం ఫ్యాక్టరీని మూసేస్తామమని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెల్లడించారు. మంగళవారం గ్రామస్తులతో కలిసి ఫ్యాక్టరీని సందర్శించారు. కర్మాగారం నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. జినుగుర్తి గేట్ వద్ద ఉన్న గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్లో చదువుతున్న 600 మంది విద్యార్థులు సైతం ఫ్యాక్టరీతో ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న కర్మాగారాన్ని లాకౌట్ చేస్తామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఏఈఓ సిద్దార్థ తెలిపారు.

కంటి వెలుగుపై అవగాహన



24వ వార్డులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

వికారాబాద్ అర్బన్: అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర సూచించారు. వార్డు సూపర్ వైజర్లు, వార్డు ఆఫీసర్లు, రిసోర్స్ పర్స న్లు, మున్సిపల్ సిబ్బందికి కంటి వెలుగు కార్యక్రమం అమలుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని 1, 24, 31వ వార్డుల్లో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వార్డుకు ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. జనాభా, శిబిరానికి వచ్చే వారి సంఖ్య ఆధారంగా వైద్య సేవలు అందజేస్తామని చెప్పారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్‌లోని 34 వార్డుల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టంచేశారు. అనంతరం క్యాంపుల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది, అధికారులు ఉన్నారు.

హత్యకు పాల్పడిన ముగ్గురికి రిమాండ్

ధారూరు: హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు సీఐ అప్పయ్య తెలిపారు. మంగళవారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 11న మండల పరిధిలోని నాగసముందర్‌లో ఇంటి స్థలం విషయమై, పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని కొత్త చిన్నమల్లయ్య అనే వ్యక్తిని.. ఇదే గ్రామానికి చెందిన మెట్లకుంట్ల నర్సింలు, అతని కూమారుడు వెంకటేశ్, అతని అన్న కుమారుడు శ్రీనివాస్ కలిసి హత్య చేశారు. రాత్రి సమయంలో బహిర్భూమికి వెళ్లిన చిన్నమల్లయ్యపై పీర్ల మర్రి చెట్టు వద్ద దాడి చేశారు. గొడ్డలి, ఇనుప పైపులతో కొట్టి హత్య చేశారు. ఈ మేరకు ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఐ నరేందర్ ఉన్నారు.

పారదర్శకతకు పాతర!

మూణ్నాళ్ల ముచ్చటగానే బయోమెట్రిక్ హాజరు

- పైలెట్ ప్రాజెక్టు కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు
- సత్ఫలితాలిచ్చినా.. మూలకు చేరిన మిషన్లు
- కొనసాగింపుపై చిత్తశుద్ధి లేకపోవడమే కారణం



ఓ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్ (ఫైల్)

వికారాబాద్: ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరులో పారదర్శకత కోసం ప్రభుత్వం అమలు చేసిన బయోమెట్రిక్ విధానం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఏడాది పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు కోసం వినియోగించిన బయోమెట్రిక్ మిషన్లు అధికారుల నిర్లక్ష్యంతో మూలన పడ్డాయి. ఈ పద్ధతిలో హాజరు తీసుకోవడం ద్వారా ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలల్లో కొంత ఇబ్బంది అనిపించినా.. మిగతా చోట్ల విజయవంతమైంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులు, ఇతర ప్రైవేటు సంస్థల్లో ఈ విధానం అమలు చేస్తున్నారు. పెన్షన్ల పంపిణీ, మీసేవ కేంద్రాలు, గ్రామీణ బ్యాంకుల్లో సైతం బయోమెట్రిక్ ప్రస్తుతం సక్సెస్ ఫుల్‌గా అమలవుతోంది. కానీ విద్యాశాఖ మాత్రం బయోమెట్రిక్‌ను మూలన పడేసింది.

మార్పు ఆశించలేమా..?

మార్పును ఆశించి ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ అటెండెన్స్ జిల్లాలో అభాసుపాలవుతోంది. ప్రస్తుతం ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఇప్పటికే కళాశాలలు, గురుకుల పాఠశాలలు తదితర సంస్థల్లో బయోమెట్రిక్‌ను అమలు చేస్తున్న ప్రభుత్వం 2018లో సర్కారు ఆస్పత్రులతో పాటు పాఠశాలల్లోనూ ఈ పద్ధతికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టు కింద పది జిల్లాలను ఎంచుకోగా ఇందులో వికారాబాద్ ఒకటి. ప్రయోగాత్మక కార్యక్రమం విజయవంతం కావడంతో పాటు మంచి ఫలితాలు ఇవ్వటంతో ఆరు నెలల తర్వాత రాష్ట్రమంతటా అమలు చేశారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం బాగా మెరుగైంది. కొద్ది రోజులకే చిన్న కారణాలను సాకుగా చూపిస్తూ మిషన్లను మూలన పడేశారు. అమలు చేయాల్సిన విద్యాశాఖ ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

1,063 స్కూళ్లలో అమలు

జిల్లాలో 1,063 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో ఏడాదిన్నర పాటు బయోమెట్రిక్ అమలైంది. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల హాజరును సైతం ఈ విధానంలోనే తీసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు వ్యక్తిగత ఐడీలు ఇచ్చారు. ఉదయం, సాయంత్రం హాజరు తీసుకునేలా విధివిధానాలు రూపొందించి అమలు చేశారు. ఆయా పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యను బట్టి వీటిని అందజేశారు. 500 మందికిపైగా విద్యార్థులున్న పాఠశాలల్లో బయోమెట్రిక్ సక్సెస్ అయ్యింది. దీనిద్వారా మండలం, జిల్లాతో పాటు రాష్ట్ర స్థాయి వరకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఆన్‌లైన్ ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును ఎప్పటికప్పుడు పరిశీలించే వెసులుబాటు దొరికింది. దీంతో హాజరుశాతం కూడా మెరుగైనట్లు అధికారులు చెబుతున్నారు. మంచి ఫలితాలిచ్చిన ఈ పద్ధతిని ఆపేయడంపై అటు తల్లిదండ్రులు, ఇటు ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆదేశాలు రాలేదు



పైలెట్ ప్రాజెక్టు కింద మన జిల్లాలో బయోమెట్రిక్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేశాం. ఇది మంచి ఫలితాలనిచ్చింది. ఈ ఏడాది బయోమెట్రిక్ కొనసాగింపుపై విద్యాశాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈ విషయంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– రేణుకాదేవి, డీఈఓ

కమలదళంలో జోష్

- పాలమూరు బరిలో అమిత్‌షా వార్తలపై నేతల సంబరాలు
- అగ్రనేత వస్తే.. విజయం తమదేనంటున్న శ్రేణులు



కొడంగల్: బీజేపీ కొడంగల్ శ్రేణుల్లో నూతన ఉత్తేజం కనిపిస్తోంది. పార్టీ అగ్రనేత అమిత్‌షా పాలమూరు నుంచి ఎంపీగా పోటీ చేస్తారనే వార్తలు కార్యకర్తలు, నాయకుల్లో సంతోషం రేకెత్తించాయి. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, మద్దూరు, బొంరాస్‌పేట మండలాలకు చెందిన కమలనాథులు ఈ విషయమై సంబరాలు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు కొడంగల్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి బలమైన నాయకుడు లేరనే ప్రచారం ఉంది. పాలమూరు ఎంపీ స్థానం నుంచి అమిత్‌షా నిలబడితే కొడంగల్‌లోనూ పార్టీ బలం పెరిగే అవకాశం ఉంది. కొడంగల్‌లో బీజేపీ నుంచి ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులే పోటీ చేశారు. ఎన్నికల తర్వాత వీరెవరూ మళ్లీ కనిపించలేదు. దీంతో స్థానికంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భరోసా కరువైంది. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానం నుంచి 1999లో బీజేపీ తరఫున ఎంపీ జితేందర్‌రెడ్డి పోటీ చేసి గెలిచారు. అప్పట్లోనే సుమారు 4లక్షల ఓట్లు సాధించి, రికార్డు సృష్టించారు. కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌గనర్ ఎంపీ స్థానం పరిధిలో ఉంది. దీంతో పాలమూరు రాజకీయాలపై కొడంగల్ ప్రజలకు ఆసక్తి నెలకొంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి రాష్ట్ర మాజీ మంత్రి డీకే అరుణ పోటీ చేశారు. 3,33,573 ఓట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. 1971 నుంచి మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి ఎంతో మంది ఉద్దండులైన నాయకులు పోటీ చేసి విజయం సాధించారు. వనపర్తి సంస్థానాధీశులు రామేశ్వర్‌రావు 1971, 1977లో పోటీ చేసి గెలిచారు. కేంద్ర మాజీ మంత్రి మల్లికార్జున్ నాలుగు సార్లు విజయం సాధించారు. సీఎం కేసీఆర్ 2009లో పాలమూరు నుంచి పోటీ చేసి గెలిచారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరుగాంచిన జైపాల్‌రెడ్డి రెండు సార్లు విజయం సాధించారు. కొడంగల్ ప్రాంతానికి చెందిన బీసీ నేత విఠల్‌రావ్ 2004లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచారు.

బలం పెరుగుతుంది



మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి అమిత్‌షా పోటీ చేస్తే బీజేపీ విజయం ఖాయం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ రూపురేఖలు మారిపోతాయి. బలమైన నాయకుడు ఉంటే కార్యకర్తలకు, ద్వితీయ శ్రేణి నాయకులకు ధైర్యంగా ఉంటుంది. దేశంలోనే తిరుగులేని నేతగా ఉన్న అమిత్‌షా పాలమూరుకు వస్తే కార్యకర్తలు సంతోషిస్తారు. ఆ ప్రభావం మొత్తం తెలంగాణపై ఉంటుంది.

– పున్నంచంద్ లాహోటీ, బీజేపీ నాయకుడు, కొడంగల్

కవన కుతూహలం

- 27 నుంచి 29 వరకు హైదరాబాద్ సాహిత్యోత్సవం
- తరలిరానున్న కవులు, కళాకారులు, మేధావులు



సాక్షి, సిటీబ్యూరో: వైవిధ్యభరితమైన హైదరాబాద్ సాహితీ ఉత్సవం (హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్) 13వ ఎడిషన్‌కు నగరం సన్నద్ధమవుతోంది. ఈ నెల 27 నుంచి 29 వరకు విద్యారణ్య స్కూల్ వేదికగా వేడుకలు జరగనున్నాయి. కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు నిలిచిపోయిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌ను ఈసారి ఘనంగా నిర్వహించేందుకు హెచ్‌ఎల్‌ఎఫ్ ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విభిన్న కళలు, సాహిత్యం, సంస్కృతులను ఒకే వేదికపైకి తెచ్చేందుకు ప్రతి సంవత్సరం హైదరాబాద్ సాహిత్యోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2010 నుంచి నిరాటంకంగా (కోవిడ్ కాలం మినహా) జరుగుతున్న లిటరరీ ఫెస్టివల్ అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రాచుర్యాన్ని గడించింది. ప్రపంచంలోని అనేక దేశాలకు చెందిన ప్రముఖులు, సాహితీవేత్తలు, రచయితలు, కవులు, కళాకారులు, భిన్న భావజాలాలు, విభిన్న జీవన సమూహాలను ప్రతిబింబించే కళారూపాలకు, సాహిత్య, సాంస్కృతిక ప్రక్రియలకు ఇది వేదికగా నిలిచింది. మూడు రోజుల పాటు సాహితీ ప్రియులను అక్కున చేర్చుకొని సమకాలీన సాహిత్య, సామాజిక అంశాలపై లోతైన చర్చలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

అతిథి దేశంగా జర్మనీ..

హెచ్‌ఎల్‌ఎఫ్ 13వ ఎడిషన్‌కు జర్మనీ అతిథి దేశంగా హాజరు కానుంది. ఆ దేశానికి చెందిన పలువురు రచయితలు, మేధావులు భాగస్వాములు కానున్నారు. ప్రముఖ జర్మనీ యువ నవలా రచయిత్రి ఎవేన్‌కో బుక్కోసీ ఈ వేడుకల్లో పాల్గొంటారు. జర్మనీ సాంస్కృతిక, కళారూపాలను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నారు.

కొంకణి సాహిత్యం ఎంపిక..

ఈ ఏడాది కొంకణి భాషా సాహిత్యాన్ని భారతీయ భాషగా ఎంపిక చేశారు. గతేడాది జ్ఞానపీఠ అవార్డు పొందిన కొంకణికి చెందిన ప్రముఖ రచయిత దామోదర్ మౌజో ఈ వేడుకల్లో కీలకోపన్యాసం చేయనున్నారు. కొంకణి భాషా చిత్రాల దర్శకుడు బార్డ్‌రాయ్‌బరెక్టో పాల్గొంటారు. కొంకణి నృత్యాలు, జానపద కళలను ప్రదర్శించనున్నారు.

ప్రముఖుల ప్రసంగాలు

ప్రఖ్యాత దర్శకుడు దీప్తీ నవల్, ప్రముఖ పాత్రికేయుడు, రచయిత పాలగుమ్మి సాయినాథ్, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత మానస ఎండ్లూరి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నుంచి గీతా రామస్వామి, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు. జర్మనీతో పాటు అమెరికా, బ్రిటన్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన రచయితలు, కళాకారులు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 250 మందికి పైగా ప్రతినిధులు వేడుకల్లో పాల్గొంటారు. వేడుకల్లో భాగంగా హైదరాబాద్ చారిత్ర వైభవాన్ని, వాస్తు నైపుణ్యాన్ని ప్రతిబింబించే పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉషా ఆకెళ్ల రూపొందించిన 'హమ్ ఐసీ బాత్' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు.

ఇది అందరి వేడుక



హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. ఈసారి మెట్రో రైల్ ప్రత్యేక ప్రచారం నిర్వహించనుంది. ఖైరతాబాద్ నుంచి విద్యారణ్య స్కూల్ వరకు మూడు రోజుల పాటు ప్రతి 15 నిమిషాలకో ఉచిత ట్రిప్పును ఏర్పాటు చేయనుంది.

– ప్రొఫెసర్ విజయ్‌కుమార్

శోకసంద్రంలో మన్నెగూడ

- నలుగురు యువకుల మృతితో విషాద ఛాయలు
- రోడ్డున పడ్డ బాధిత కుటుంబాలు
- పలువురు నేతల పరామర్శ



మృతదేహాల వద్ద నివాళులర్పించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

పరిగి: మన్నెగూడ శోకసంద్రమైంది.. ఒకే కుంటుంబానికి చెందిన నలుగురు యువకుల మృతితో గ్రామంలో తీరని విషాద ఛాయలు అలుముకున్నాయి. కోట్‌పల్లి ప్రాజెక్టులో మునిగి సోమవారం నలుగురు యువకులు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. మంగళవారం వీరి మృతదేహాలను ఇంటి ముందు పెట్టిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. చేతికందివచ్చిన కొడుకుల అకాల మృతితో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మన్నెగూడకు చెందిన బాయికని పెంటయ్య కుమారులు లోకేశ్(28), వెంకటేశ్(25), వీరి చిన్ననాన్న కుమారుడు జగదీశ్(24), వీరి మేనత్త కుమారుడు రాజేశ్(24) ఈత సరదా కోసం కోట్‌పల్లికి వెళ్లి మృత్యువాత పడిన విషయం తెలిసిందే. పైనలుగురు యువకుల తండ్రులైన పెంటయ్య, బుచ్చయ్యతో పాటు వీరి మేనమామ సైతం గతంలోనే మరణించారు. దీంతో కొడుకులే కుటుంబానికి పెద్దదిక్కుగా మారి తల్లులు, తోబుట్టువులను చూసుకుంటున్నారు. చెట్టంత కుమారులను విగత జీవులుగా చూసిన తల్లులు గుండెలు బాదుకున్నారు.

ఆదుకుంటాం..

పూడూరు: కోట్‌పల్లి ప్రాజెక్టులో మునిగి చనిపోయిన వారి బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని మంత్రి సబితారెడ్డి అన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రయ్య తదితరులు మంగళవారం మన్నెగూడకు చేరుకుని మృతులకు నివాళులర్పించి, ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు డబుల్ బెడ్రూం ఇళ్లతో పాటు అర్హత ఉన్నవారికి ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

గొర్రెలకాపరులు ఆర్థిక ప్రగతి సాధించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గొర్రెల, మేకల పెంపకందారులు ఆర్థిక ప్రగతి సాధించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, అదనపు కలెక్టర్ తిరుపతిరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా 2023 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొర్రెల కాపారులు ఐకమత్యంతో చైతన్యవంతులై ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని సూచించారు. గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పగుడాల యాదయ్య, ప్రధాన కార్యదర్శి అమీర్‌పేట మల్లేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న గొర్రెల పథకం పంపిణీలో మొదటి విడతలో అనేక అక్రమాలు జరిగాయని, రెండో విడత కార్యక్రమాన్ని నగదు బదిలీతో ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్ర శ్రీశైలం, ఉపాధ్యక్షుడు పెంటయ్య, నాయకులు మల్లేశ్ యాదవ్, కృష్ణ, మల్లయ్య, అంజయ్య, రాజు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయండి

- ఉపాధి కూలీల ఆధార్ వివరాలు నమోదు చేయండి
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి కలెక్టర్ నిఖిల ఆదేశం

అనంతగిరి: జిల్లాలోని ఉపాధి హామీ కూలీల ఆధార్, నమోదైన పనుల వివరాలను మూడు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ నిఖిల సంబంధిత అధికారులను ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్‌డీఓ కృష్ణన్‌తో కలిసి మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల ఆధార్ నమోదు, పెండింగ్ సోషల్ ఆడిట్ పేరాల పనులపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..ఎంపీడీఓల ఆధ్వర్యంలో ఆపరేటర్లు, టీఏలు, ఈసీలు, టెక్నికల్ సిబ్బందితో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 1,216 సోషల్ ఆడిట్ పేరాలు పెండింగ్‌లో ఉన్నాయని స్పష్టంచేశారు. వీసీలో ఎంపీడీఓలు, ఏపీఓలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నిఖిల



అమ్మవారి ఆలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తదితరులు

మైసమ్మతల్లికి ప్రత్యేక పూజలు

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని పాతూర్‌లో మంగళవారం జరిగిన మైసమ్మ జాతరకు జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, ఎంపీపీ చంద్రకళ వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. వీరివెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదు


మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ మేనేజర్ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఎస్‌బీఐ ఎదుట విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందజేస్తున్న పంట పెట్టుబడి సాయం డబ్బులు రైతులకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అలాగే వినియోగదారులను, ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అతనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెరువులో దూకి..

వివాహిత ఆత్మహత్య


చెరువులోంచి మృతదేహాన్ని వెలికి తీస్తున్న ఫైర్ సిబ్బంది

యాలాల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని అన్నసాగర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాల శ్రీశైలం, లక్ష్మీ(30) దంపతుల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా గొడవ చోటుచేసుకుంది. ఈ విషయంలో మనస్తాపానికి గురైన లక్ష్మి సమీపంలోని ఊరచెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న తాండూరు అగ్నిమాపకకేంద్ర అధికారి నాగార్జున, ఎస్‌ఐ అరవింద్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహం కోసం గాలించారు. మరుసటి రోజు ఉదయం మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

గృహిణి అదృశ్యం


హబీబాబేగం (ఫైల్)

పరిగి: ఇంట్లో నుంచి వెళ్లిన గృహిణి అదృశ్యమైన ఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ కేంద్రంలోని మున్నూరు వాడకు చెందిన ఎండీ హాశం కూతురు హబీబాబేగంను హైదారాబాద్‌కు చెందిన ఇస్మాయిల్‌కు ఇచ్చి వివాహం చేశారు. పది రోజుల క్రితం అనారోగ్యం కారణంగా హైదారాబాద్ నుంచి పరిగికి వచ్చి తల్లిగారి ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఈనెల 16న ఉదయం ఇంట్లో నుంచి హబీబాబేగం ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జాతీయ అవార్డుకు ఎంపీటీసీ ఎంపిక

చేవెళ్ల: బహుజన సాహిత్య అకాడమీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు అల్లవాడ ఎంపీటీసీ సత్యనారాయణాచారిని ఎంపిక చేశారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు మలగళ్ల మల్లేశ్ గౌతమ్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం జరిగింది. జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా సత్యనారాయణచారి ఎంపిక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మహనీయుల ఆలోచనల కోసం నిరంతరం కృషి చేస్తున్న వివిధ రంగాలకు చెందిన వారు కవులు, కళాకారులు, జర్నలిస్టులు, కార్మికులు, కర్షకులు, రాజకీయ వేత్తలు, సంఘ సేవకుల ప్రతిభను గుర్తించి జాతీయ అవార్డులకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 12న తిరుపతిలో జరిగే కార్యక్రమంలో అవార్డుల ప్రదానం చేస్తారన్నారు.


తాండూరు రూరల్: ఎల్మకన్నెలో బంగారమ్మ ఆలయం చుట్టూ మహిళల ప్రదక్షిణ

బంగారమ్మకు బోనాలు

బషీరాబాద్: మండల పరిధిలోని జీవన్గీలో బంగారమ్మ జాతర ఘనంగా జరిగింది. మంగళవారం అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది. ఊరంతా ఆడపడచులు, బంధుగణంతో సందడి నెలకొంది. శుక్రవారం ఊరడమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నవనీతరెడ్డి తెలిపారు.

చల్లంగ చూడు తల్లి

తాండూరు రూరల్: ఎల్మకన్నెలో బంగారమ్మ జాతర వైభవంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు డప్పువాయిద్యాలతో బోనాలతో తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రజలందరూ చల్లంగా ఉండాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని మొక్కుకున్నారు.

సాగు ముమ్మరం

కొడంగల్ నియోజకవర్గంలో యాసంగి సాగు జోరుగా సాగుతోంది. వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. కరిగెట, వరి నారు తదితర పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలకు చేతి నిండా పని దొరుకుతోంది. కొడంగల్ పెద్ద చెరువు, హస్నాబాద్ చెరువు, అంగడిరాయిచూర్, పర్సాపూర్, పెద్ద నందిగామ, బొంరాస్‌పేట మండలం కాకరవాణి ప్రాజెక్టు, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ చెరువుల్లో సాగుకు సరిపడా నీళ్లు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో టైబందీ నిర్వహించి పొలాలకు సాగునీరు వదులుతున్నారు. కొడంగల్ పెద్ద చెరువు కింద 550, హస్నాబాద్ పెద్ద చెరువు కింద 950 ఎకరాల ఆయకట్టు ఉంది.

– కొడంగల్


వరినాట్లు వేస్తున్న కూలీలు

కోటబాసుపల్లిలో ఉద్రిక్తత

- ఇరువర్గాల ఘర్షణ
- 11 మందిపై కేసు నమోదు


కోటబాసుపల్లిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మంగళవారం గ్రామంలో ఇరువర్గాల యువకులు ఘర్షణ పడ్డారు. ఓ యువకుడిపై కర్రలతో దాడికి దిగారు. పెద్ద ఎత్తున ఘర్షణ చోటు చేసుకోవడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇరువర్గాల యువకులు ఘర్షణకు పాల్పడటంతో గ్రామ పెద్దల సమక్షంలో సముదాయించేందుకు యత్నించారు. సముదాయిస్తుండగానే ఓ హోటల్ వద్ద ఓ యువకుడిపై మరో వర్గం యువకులు దాడికి పాల్పడ్డారు. దీంతో పెద్ద ఎత్తున ఇరువర్గాలు దాడికి యత్నించగా.. విషయం తెలుసుకున్న పోలీసులు కోటబాసుపల్లి గ్రామానికి చేరుకొని అల్లరిమూకలను చెదరగొట్టారు. ఇరు వర్గాల ఘర్షణకు సంబంధించి 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

బెల్టుషాపులు తొలగించాలి...

గ్రామంలో విచ్చల విడిగా బెల్టుషాపులు కొనసాగుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు చేసిన డబ్బులు మద్యానికి వెచ్చిస్తున్నారని అన్నారు. ఈ మద్యం వల్లే గ్రామంలో తరచూ గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. గ్రామంలో బెల్టుషాపులు తొలగించాలని వారు కోరారు.

పోలీసులమని చెప్పి..

- మాయమాటలతో బంగారు ఉంగరం తస్కరణ
- వికారాబాద్ పట్టణంలో ఘటన


అనుమానితుల చిత్రం

అనంతగిరి: ఓ వ్యక్తికి మాయమాటలు చెప్పి బంగారు ఉంగరాన్ని తస్కరించిన నకిలీ పోలీసుల ఘటన వికారాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 16న మధ్యాహ్నం పార్వతయ్య స్వామి అనే వ్యక్తి పట్టణంలోని జనప్రియ దుకాణం ఎదుట ఉన్న పూల దుకాణంలో పూలు కొని వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్కులు ధరించి పార్వతయ్య స్వామి వద్దకు వచ్చారు. వెంటనే అతన్ని ఆపి 'మేము పోలీసులం ఒంటిపై బంగారు వస్తువులు ఉంటే దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ఒంటిపై ఎలాంటి ఆభరణాలు పెట్టుకోవద్దన్నా'రు. అలా ఆయన్ను మాయమాటలతో నమ్మించి అతని చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని ఆ వ్యక్తులు తీసుకుని ఒక పేపర్‌లో చుట్టి అతని బ్యాగులో పెట్టే క్రమంలో అతని దృష్టిని మళ్లించారు. పార్వతయ్య స్వామి కొంతదూరం వెళ్లి అనుమానంతో ప్యాకెట్‌ను పరిశీలించగా బంగారు ఉంగరం స్థానంలో రాయి కనిపించింది. వెంటనే పోలీసులను ఆశ్రయించాడు.

ఐడీకార్డును అడగండి

ఇకపై ఎవరైనా వ్యక్తులు సాధారణ దుస్తులలో తాము పోలీసులమని చెబితే నమ్మవద్దని, వారి ఐడీ కార్డు అడగాలని సూచించారు. అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ శీను తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

తాండూరులో చిరువ్యాపారి ఆత్మహత్య


చిరంజీవి మృతదేహం

తాండూరు: ఓ చిరు వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్టీసీ అధికారుల వేధింపులే ప్రాణాలు తీశాయని స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల జిల్లా బూడిదపాడు గ్రామానికి చెందిన చిరంజీవి అలియాస్ దేవయ్య(45) కొన్నేళ్లుగా తాండూరు ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఓ చిన్న డబ్బాను అద్దెకు తీసుకొని వ్యాపారం చేస్తున్నాడు. అద్దెను ప్రతి నెలా చిరంజీవి చెల్లించాడు. అయితే స్థలానికి సంబంధించి జీఎస్టీ కోసం మరో లక్ష వరకు చెల్లించాలని రెండు నెలలుగా ఆర్టీసీ డీఎంతో పాటు సూపరింటెండెంట్‌లు వత్తిడి తీసుకొచ్చారు. దుకాణంలో వ్యాపారం చేసుకొంటున్న చిరంజీవిని సోమవారం మధ్యాహ్నం వేళ ఆర్టీసీ సిబ్బంది డిపో మేనేజర్ పిలుస్తున్నారని చెప్పి తీసుకెళ్లారు. డిపో మేనేజర్‌తో మాట్లాడి వచ్చే సరికి ఆర్టీసీ అధికారులు దుకాణానికి తాళం వేశారు. దుకాణానికి వేసిన తాళాలు ఇవ్వాలని వేడుకున్నట్లు స్థానిక వ్యాపారులు తెలిపారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయలు దేరి కల్లూరు ప్రాంతంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చించోళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయమై ఆర్టీసీ డిపో మేనేజర్, డిపో అధికారులను వివరణ కోసం పలు సార్లు ఫోన్ చేయగా స్పందించలేదు.

ప్రియుడి ఇంటి ఎదుట ఆత్మహత్యాయత్నం


ప్రియుడి ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రియురాలు సుజాత

కుల్కచర్ల: పెళ్లికి నిరాకరిస్తున్నాడనే కారణంతో ఓ యువతి ప్రియుడి ఇంటి ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన చౌడాపూర్ మండలం మందిప్పల్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుజాత, కేశవులు ప్రేమించుకున్నారు. కేశవులు తనతో పెళ్లికి నిరాకరిస్తున్నాడనే కారణంతో ఉదయాన్నే అతని ఇంటికి వెళ్లిన యువతి పెట్రోల్ బాటిల్ పట్టుకుని ఆత్మహత్య చేసుకుంటానంటూ నిరసన చేపట్టింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని ఇరు కుటుంబాల మధ్య రాజీ కుదిర్చారు. మధ్యాహ్నం వరకు పంచాయితీ కొనసాగగా.. వెంటనే ఇరువురికి పెళ్లి చేశారు. ఇదిలా ఉండగా ఇద్దరికి గతంలోనే వేర్వేరు వ్యక్తులతో వివాహాలు జరిగినట్లు సమాచారం.

పురస్కారాలకు ఎంపిక

షాద్‌నగర్ టౌన్: స్వామి వివేకానంద జయంతి వారోత్సవాల ముగింపు సందర్భంగా తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం వారు ఉత్తమ సేవా కార్యక్రమాలకు గాను పురస్కారాలను అందజేస్తున్నారు. 2023 సంవత్సరానికి ఈ పురస్కారాలకు ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మఠం శశిధర్, షాద్‌నగర్ పట్టణానికి చెందిన న్యాయవాది సన్నిధానం కృష్ణశర్మ ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో పురస్కారాలు అందజేయనున్నట్లు ఫోరం కోఆర్డినేటర్లు రాజేందర్, హేమంత్ తెలిపారు.

పర్యాటకుల అనుమతిపై తర్జనభర్జన


కోటపల్లి ప్రాజెక్టును సందర్శించిన అధికారుల బృందం

ధారూర్: కోటపల్లి ప్రాజెక్టు వద్ద ప్రమాదాల నివారణకు రెవెన్యూ, సాగునీటి, అటవీ, పోలీసు అధికారులు చర్యలు చేపడుతున్నారు. సందర్శకులను ప్రాజెక్టు నీటిలోపలికి అనుమతించాలా? వద్దా అనే విషయమై తర్జనభర్జన పడుతున్నారు. మంగళవారం తహసీల్దారు భువనేశ్వర్, వికారాబాద్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ అప్పయ్య, ఎస్‌ఐ నరేందర్, ఎఫ్‌ఎస్‌ఓ రాజేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ నవీన్‌లు ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించారు. నలుగురు నీట మునిగి మృతి చెందిన ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద రక్షణ చర్యలపై చర్చించారు. ప్రాజెక్టు చుట్టూ జాలితో ఫెన్సింగ్ వేయడం, సందర్శకులను నీటిలోకి అనుమతించకుండా ఉండటం, బోటింగ్ చేసే వారినే ప్రాజెక్టు లోపలికి అనుమతించి, ప్రాజెక్టు చుట్టూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం తదితర వాటిపై చర్చించారు. వివిధ రక్షణ చర్యల విషయమై కలెక్టర్‌కు నివేదిక పంపించనున్నారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించండి


మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్కయ్య

కొడంగల్: దళితులపై దాడి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్కయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాదాన్ని వ్యతిరేకించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. కొడంగల్, తుంకిమెట్ల, తాండూరు, నిజామాబాద్‌లో దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాదం పెరిగిందని విమర్శించారు. కులాల మధ్య ఘర్షణలు సృష్టించి భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారని అన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, బల్‌రామ్, శ్రీనివాస్, బాలరాజ్, లక్ష్మప్ప తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ విధానాలు నచ్చకే..


కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి

- కాంగ్రెస్‌లోకి చేరికలు
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి

పరిగి: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే కాంగ్రెస్ పార్టీలోకి వలసలు మొదలవుతున్నాయని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండలం బొంపల్లిలో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ వార్డు మెంబర్ కోళ్ల నర్సింహులుతో పాటు పలువురు నేతలు పరిగి పట్టణంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఏక పక్ష నిర్ణయాలతో సామాన్య, పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని వాపోయారు. దళితబంధు పథకం పార్టీ నేతలే పంచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరింత మంది బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి, బొంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు ముద్దం బాల్‌రాజ్ యాదవ్, పార్టీ నేతలు గుడిసె రాములు, భాస్కర్, మల్‌రెడ్డి, యాదయ్య, మహేశ్, కృష్ణ, బురాన్, గుడాల శ్రీనివాస్, హన్మయ్య, కుర్వ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన తప్పనిసరి


ప్రత్యేక పూజా కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి తదితరులు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కల్లాపూర్ గ్రామ పరిధిలోని శ్రీ సప్తముఖి లొంక ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జనభక్త మండలి భజనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందన్నారు. లొంక హనుమాన్ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- రేపటి నుంచి జేపీ దర్గా ఉత్సవాలు
- మూడు రోజుల పాటు ప్రార్థనలు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు


జేపీదర్గా

కొత్తూరు: ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లను వక్ఫ్‌బోర్డు అధికారులు పూర్తి చేశారు. ఈ నెల 19నుంచి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల దృష్ట్యా వక్ఫ్‌బోర్డు అధికారులు ఇప్పటికే దర్గా ఆవరణలో స్తంభాలు, మినార్లు ఏర్పాటు చేసి వాటిని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా షాద్‌నగర్ ఏసీపీ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

దర్గా ప్రాశస్త్యం

మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో వెలసిన జహంగీర్‌పీర్ దర్గా ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధిగాంచింది. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంది. క్రీ.శ. 15వ శతాబ్దంలో మొగల్ చక్రవర్తుల కాలంలో ఇరాక్ దేశానికి చెందిన సయ్యద్ గౌసొద్దీన్, బురానొద్దీన్ అనే ఇద్దరు సోదరులు ఇన్ముల్‌నర్వలోని దట్టమైన అటవీ ప్రాంతానికి వచ్చారు. వారు ఇక్కడే కొంతకాలం పాటు ఉంటూ తమ కుల దైవాన్ని స్మరించుకుంటూ కాలధర్మం చెందారు. వీరి సమాధులపైనే చిన్న దర్గాలను నిర్మించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు దక్కన్‌పై దండెత్తి వచ్చిన సమయంలో, అతని కొలువులో ఉన్న పండితుడు ఒకరు దర్గాను దర్శించి దాని విశిష్టతను గుర్తించి ఔరంగజేబుకు తెలిపారు. దీంతో ఆయన దర్గాను దర్శించుకుని సలామ్ అని నమస్కరించగా, సమాధుల నుంచి ప్రతి సలామ్ అనే శబ్దం వచ్చింది. దర్గా మహత్యాన్ని గుర్తించిన చక్రవర్తి 16వ శతాబ్దంలో ఇబ్రహీం అలీ అనే పండితున్ని దర్గాకు సంరక్షకుడిగా నియమించారు.

ఏర్పాట్లు పూర్తి

జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 19న గంధోత్సవం, 20న దీపారాధన, 21న ఖత్మే ఖురాన్‌తో ఉత్సవాలు ముగియనున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు హైదరాబాద్, ఇతర జిల్లాలు, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. మొదటి రెండు రోజులు అధిక సంఖ్యలో భక్తులు దర్గాను దర్శించుకుంటారు. వారిలో చాలా మంది దర్గా ఆవరణలోనే రాత్రిళ్లు ప్రార్థనలు, భజనలు చేసి అక్కడే నిద్రిస్తారు. వారి కోసం వక్ఫ్‌బోర్డు అధికారులు రెండు రోజుల పాటు రాత్రిపూట భోజన, తాగునీటి వసతి, నిద్రించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు

ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు కొనసాగనున్నాయి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో మూడు రోజులు పాటు దర్గా ఆవరణలోకి ఎలాంటి వాహనాలను అనుమతించకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. దర్గాకు చేరుకునే రెండు రోడ్లలోనూ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను లోపలికి వెళ్లకుండా పార్కింగ్ స్థలానికి చేరుకునేలా చర్యలు చేపట్టారు.

స్టాళ్ల ఏర్పాటు

ఉత్సవాల సందర్భంగా దర్గా ఆవరణలో పదుల సంఖ్యలో వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. చిన్నారుల ఆట వస్తువులు, మహిళల గాజులు విక్రయించే స్టాళ్ల ఏర్పాటు చేశారు. వీటికి తోడు దర్గా ఆవరణలో రంగుల రట్నాలు.. ఇతర ఆట యంత్రాలను ఏర్పాటు చేశారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: అసంఘటిత కార్మిక సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్ల దేవేందర్ రెడ్డి ఆరోపించారు. పెద్ద అంబర్‌పేట్ లారీ డ్రైవర్స్ యూనియన్ కార్మికులు మంగళవారం స్థానిక గండి మైసమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, మండల కార్యదర్శి హరిసింగ్ నాయక్‌లతో కలిసి హాజరై మాట్లాడారు. అసంఘటిత కార్మిక సమస్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నా వీరికి ఆర్థిక భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రధాని మోడీ తెచ్చిన నూతన ట్రాన్స్‌పోర్టు చట్టం డ్రైవర్లకు గుదిబండగా మారిందన్నారు. భవిష్యత్తులో వీరి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆమనగంటి వెంకన్న, మండల కార్యదర్శి హరిసింగ్ నాయక్, ఆర్టీసీ నాయకులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.